కథ

# ప్రక్షాళనం

**శ్రీపాద విజయలక్ష్మీప్రసాద్**

పండుగ.

పరమేశ్వర్రావుగారిల్లు ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, మనుమలు, మనవరాళ్ళు, వియ్యాలవారితో సందడిగా వుంది. ఉదయం పది గంటలైంది. టిఫిన్ల హడావుడీ అయింది. చెమటలు తుడుచుకుంటూ, డైనింగ్ టేబిల్ సర్ది, క్లీన్ చేసి, వంటింట్లో వంట మొదలెట్టింది, ఆ యింటి వంట మనిషి పార్వతమ్మ. ఉదయం తాగిన కప్పు కాఫీ ఎప్పుడో ఆవిరయిపోయింది. పరపరా కూరలు తరుగుతూ అనుకుంది-

'శాంతమ్మగారినో రెండొందలు అడ్వాన్సడిగి, పావనికి సాయంత్రమన్నా, ఓ కాటన్ చీర కొనాలి. నిన్న సాయంత్రం శాంతమ్మగారూ వాళ్ళందరూ కొత్తబట్టలు తెచ్చుకున్నారు. ఖరీదయిన షాపులకెళ్ళి పావనిక్కూడా ఓ కాటన్ చీర తేరాదూ! పోన్లే, అడగందే అమ్మయినా పెట్టదంటారు. అయినా ఆయన అర్ధాంతరంగా, నన్నూ దాన్నీ దిక్కులేని వాళ్ళని చేసి, కన్నుమూస్తే, ఆయన స్థానంలో నన్ను పనిలోకి తీసుకుని ఆధారం చూపించటమేగాక అవుట్ హవుస్‌లో నీడనిచ్చారు. అది చాల్దా!' అనుకుని సమాధాన పడింది పార్వతమ్మ. కడుపులో మంటగా అన్పించి ఓ గ్లాసుడు మంచి నీళ్ళు తాగింది.

అప్పుడే ఎందుకో కిచెన్‌లోకొచ్చిన శాంతమ్మగారు ''పార్వతమ్మా! నీళ్ళతో నీర్సం తగ్గుతుందా! కాస్త టిఫిన్ తిని పనిచేసుకోవచ్చుకదా! ఈవేళ వంట పని ఎక్కువగా వుంటుందాయె. పావనిని కాస్త సాయం రమ్మనకపోయావా?'' అన్నది కనికరంగా. ఆవిడది స్వతహాగా జాలిగుండె. దిక్కులేని పార్వతమ్మ పట్ల అంతులేని జాలి, సానుభూతీ కనబరుస్తుంది.

పార్వతమ్మ భర్త వీరభద్రం గతించి పదేళ్ళయింది. పార్వతమ్మ రెక్కల కష్టంతోనే, పావనిని గ్రాడ్యుయేషన్ దాకా చదివించింది. ఓ కాన్వెంటు స్కూల్‌లో పనిచెయ్యటమే కాక, డాక్టర్ శివకుమార్ ఇద్దరు పిల్లలకి ఇంటికి వెళ్ళి ట్యూషన్స్ చెబుతూ, తల్లిక్కాస్త ఆసరా ఇస్తోంది పావని. పచ్చగా, నాజూగ్గా అందంగా అప్పుడే విరిసిన జాజి మొగ్గలా వుండే పావనిని మురిపెంగా చూసుకునేది పార్వతమ్మ. ఎప్పుడన్నా, శాంతమ్మగారింట్లో పని చేస్తానన్నా పావనిని రానిచ్చేది కాదు పార్వతమ్మ. తల్లికెప్పుడైనా ఒంట్లో బాగాలేనప్పుడు వెళ్ళి, వంటపని చూసేది పావని. దానికి పార్వతమ్మ హృదయం విలవిల్లాడేది. పావనికి ఎలాగన్నా మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యాలనీ, ఆమె తనలా కష్టపడకూడదనీ అనుకుంటుండేది పార్వతమ్మ. అంతలోనే చూడచక్కని పిల్లనిచ్చిన దేవుడు, దీనికి తగిన మంచి వరుడిని తేగల్గిన స్థోమతని నాకీయటం మరచాడు. తగిన వరుడ్ని తేటం కాదు కదా అసలు పెళ్లి మాత్రం ఎలా చేయగలను? నా దగ్గరేం వుందని? ఏ వుదారులో పెద్దమనసుతో దీన్నే ఓ పెద్ద కట్నంగా భావించి, పెళ్ళి చేసుకుని తీసికెళ్ళాలి. నా పిచ్చిగానీ ధనమే పరమార్ధమైన ఈ లోకంలో అంతటి వుదారులెక్కడున్నారు?' అని నిట్టూర్చేది. కానీ అంతట్లోనే మళ్ళీ 'ఏమో మంచి జాతకంలో పుట్టింది. అదృష్టం దీన్ని వెదుక్కుంటూ వస్తుంది' అనేవాడు భర్త వీరభద్రం. అలాగే ఏ వుత్తముడో దీన్ని వెదుక్కుంటూ వస్తాడేమో! అని తన మనసుని వూరడించుకునేది ఆశావాదంతో పార్వతమ్మ.

మనిషిని ముందుకు నడిపించేది ఆశే. అందునా ఏ ఆధారమూ లేని పార్వతమ్మలాంటి బడుగు జీవుల బ్రతుకు బండిని ముందుకి లాగే ఇంధనం ఆశే మరి.

★ ★ ★

పార్వతమ్మ కలని నిజం చేయటానికే అన్నట్లు విజయవాడ దగ్గర అమరావతిలో వుండే శాంతమ్మగారి మరదలు యశోధరకి పెరాలిసిస్ స్ట్రోక్ వస్తే ట్రీట్‌మెంటుకోసం ఆవిడ తమ్ముడు చతుర్వేది, కొడుకు పురుషోత్తం సిటీలో వున్న శాంతమ్మగారింటికొచ్చారు. ఆ సమయంలో పార్వతమ్మ జ్వరంతో లేవలేని స్థితిలో వుండగా పావనే వంట పని కొచ్చేది. తమకి వడ్డిస్తున్న పావనిని చూసి ''ఈ పిల్లెవరూ?'' అన్నాడు చతుర్వేది, పావని ఒద్దిక ఓర్పూ ఆయనకి ముచ్చట గొల్పగా.

''మా వంటమనిషి పార్వతమ్మ కూతురు. చాలా బుద్ధిమంతురాలు. డిగ్రీ దాకా చదువుకుంది. ఏదన్నా సంబంధం వుంటే చెప్పరా వేదీ. పాపం ఈ పిల్ల పెళ్లి చేసేస్తే, ఆ పార్వతమ్మకి నిశ్చింత'' అన్నది శాంతమ్మగారు.

''అక్కయ్యా! వాళ్ళ సంగతి సరేగానీ, యశోధర పరిస్థితి చూశావుగా! ఇహ మునపట్లా లేచి తిరిగేది నమ్మకం లేదు. పురుష్‌కి ఈమధ్యనే వుద్యోగం వచ్చింది ఓ ప్రైవేట్ బాంక్‌లో. పెళ్ళి చేసుకోరా అంటే నచ్చిన పిల్ల దొరకాలంటాడు. చూసిన నాలుగు పెళ్లి సంబంధాలు పిల్ల నచ్చలేదని కొట్టేశాడు. కోడలొస్తేగానీ మా కొంపకి దక్షత రాదు. ఒక్కగానొక్క కొడుకని, నీ మరదలు నెత్తికెక్కించుకుంది వాడిని. ఇప్పుడు కొరక రాని కొయ్య అయి కూర్చున్నాడు. ముందు వీడికి నచ్చే పిల్ల నీ ఎరికలో వుందేమో చూడు'' అంటూ కష్టసుఖాలు వెళ్ళబోసుకున్నాడు చతుర్వేది శాంతమ్మగారితో.


సింక్ దగ్గర గాజుగ్లాసులు కడుగుతున్న పావనిని చూడగానే శాంతమ్మగారి మనసులో ఓ ఆలోచన తళుక్కుమంది. కానీ అంతలోనే సందేహం. 'వాడు మెచ్చితే, ఎందుకు జరగదూ!' అనుకుంది.

చున్నీని నడుం చుట్టూ ఒద్దికగా చుట్టుకుని, డైనింగ్ టేబిల్ మీద చక చకా అన్నీ సర్ది, సర్వ్ చేస్తున్న పావనిని క్రీగంట గమనిస్తూనే వున్నాడు పురుష్. అసలామెను చూడగానే అతడి కళ్ళ ముందు మెరుపు మెరిసినట్లైంది.

పచ్చని పసిమి. చక్కని రూపం. పొడుక్కి తగ్గ లావుతో ఒద్దికైన పర్సనాలిటీకి తోడు వినయ విధేయ తలుట్టిపడే మాట తీరు. కోయిల గళం మరీ మరీ ఆకట్టుకున్నాయి పురుష్‌ని. ఆమె లోపలికెళ్తే, మళ్ళీ ఎప్పుడొస్తుందా కనుల ముందుకు? అన్పిస్తోంది. పావనిలోను అతణ్ని చూశాక ఏదో కలవరం. ముఖ్యంగా ఆ తేనె రంగు సోగకళ్ళ గుచ్చుకునే చూపులు. 'ఎంత బాగున్నాడు? ఏ పిల్ల పూజాఫలమవనున్నాడో?' అనుకుంది అతడికి నెయ్యి వేస్తూ.

ఆమె కళ్ళు కిందికి వాలి అతడి ప్లేట్లో వున్నా, రెప్పలెత్తి నాల్గురోజులూ చాకిరీ ఎక్కువైనా, శ్రమ, బాధ అన్పించలేదు సరికదా, ఆ యింటికెప్పుడెప్పుడెళ్ళి వాలుదామా అన్పిస్తోంది.

'పిచ్చి పావనీ! వాళ్ళు గొప్పింటి వాళ్ళు. ఆశకైనా



హద్దులుండాలి' అని మనసు్స దెప్పుతూనే వుంది.

''ఆ ఆశ అడియాస కాదు. సఫలమవుతుంది'' అంటూ శాంతమ్మగారు పార్వతమ్మ చెవిని వేయగా, దాన్నావిడ పావనికి చెప్పగానే, ఆమె ఆనందం అర్ణవ మైంది. మనసు దూదిపింజలా గాలిలో తేలింది. హృదయం కమండలంలో ఇమడలేని గంగ వెల్లు వైంది.

పావని చెంపలను చెందర చేతుల్తో తడిమి, మెటి కలు విరిచి, ''ఎంత అదృష్టవంతురాలివి పావనీ! చక్కని పుటక తీరు, అంద చందాలు, అన్నీ గొప్పింటి పోలికలే. చిన్ననాడే అనుకున్నా, ఈ బంగారు తల్లి ఏ గొప్పిల్లో మెడుతుందని! ఈ దరిద్రంలో పుడితేనేం? ఆ చాతగాని తండ్రి కూ్కతురైతేనేం? అదృష్ట రేఖతో పుట్టావు పావనీ! ఆ కుర్రాడెంత గానో ఇష్టపడుతున్నాట్ట నిన్ను. ఇంకే పిల్లను మెచ్చను, పెళ్ళి చేసుకోనూ అంటున్నాట్ట. శాంతమ్మగారు ఎలాగోలా వాళ్ళన్నయ్యని ఒప్పించి ఈ పెళ్ళి ఖాయం చేయిస్తానన్నారు'' ఆనందంతో గొంతు తడబడ్తుంటే, చెప్పుకు పోతోంది పార్వతమ్మ.

శాంతమ్మగారింట్లో సింపుల్‌గా నిశ్చితార్థం జరిగింది. రెండు నెలల తర్వాత పెళ్ళికి ముహూర్తం కుదిరింది. పావనికి వుంగరం, పట్టుచీర పెట్టారు వాళ్ళు. యశోధర మాత్రం మరీ ఏమీ లేని వాళ్ళ సంబంధమని గునుస్తూనే వున్నా, పావని అంద చందాలు ఒద్దిక, ఓర్పు గుణగణాలూ చూసి సర్దుకుంటోంది. పావని, పురుష్‌లు ఇద్దరు ఆ కళ్యాణ ఘడియ కోసం రోజులూ, క్షణాలూ లెక్కిస్తు గడుపుతున్నారు. పురుష్ తన వేలికి వుంగరం తొడుగులో వున్న ఫోటో చూసుకుంటుంటే, అతడి ఆ చిరు స్పర్శ తనువు నిండా పులకింపచేస్తోనే వుంది. తొలి వలపు తొలకరి జల్లులా తనువును తాకి పులకింతలు రేపుతోంది.

★ ★ ★

సాయంత్రం ఐదు గంటలవుతోంటే, పావని తన బారెడు జుట్టుకు చిక్కు తీసి, జడ అల్లుకుంటూ అనుకుంటోంది 'ఈ నెల జీతం తీసేస్కుని, మంజులగారికి తన పెళ్ళి నిశ్చితార్థమయిందని చెప్పేసి వస్తా. రేపట్నుండీ ఇక వెళ్ళను. అమ్మకీ కాస్త నా సాయం కావాలి కదా పెళ్ళి పన్లకి'.

బయల్దేరుతోంటే, పార్వతమ్మ అడిగింది ''ఎక్కడికి పావనీ! త్వరగా వచ్చెయ్యి. వినాయకుడి గుడికెళ్ళి, పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోతే, వుండ్రాళ్ళ నైవేద్యం పెడతామని మొక్కు కొద్దాం!''

''వెళ్ళేప్పుడెక్కడికని అడక్కూడదని, నువ్వే అంటావు. ఈ వేళప్పుడు ఎక్కడి కెళ్తానమ్మా? మంజులగారింటికి ట్యూషన్‌కే కదా! అన్నీ మర్చిపోతావు. అసలు నీకీ మధ్య మతిమరుపెక్కుపోయింది'' అంది పర్సు తీసుకుని గుమ్మం దాటుతూ పావని.

ఆ యిల్లు సమీపిస్తోంటే కుడిరెప్ప టపాటపా కొట్టుకోసాగింది. పావనికి సెంటిమెంట్లు పట్ల విశ్వాసం తక్కువే. కానీ చిన్నప్పట్నుండీ, దిగువ మధ్య తరగతి కుటుంబాల్లో వాటిని పిల్లలకి వుగ్గుపాలతో బాటుగా పెంచి, పెద్ద చేస్తారు పెద్దలు.

డాక్టర్ శివకుమార్ భార్య మంజుల. వారి ఇద్దరు పిల్లలు శ్రీజ, శంతన్ రెండు, నాలుగు క్లాసులు చదువుతున్నారు. ఏడాదిగా వాళ్ళకి ట్యూషన్ చెబుతోంది

పావని. డాక్టర్ శివకుమార్ ఇంట్లో వుండేది తక్కువే. పావనికి ఎదురుపడిన సందర్భాలూ తక్కువే ఈ ఏడాదిలో. ఎప్పుడైనా తనకో, తల్లికో వంట్లో బాగోలేకపోతే ఆయన్నడిగి మందులు తీసుకునేది. నలభై ఏళ్ళ శివకుమార్ ఎత్తుగా, పుష్టిగా హుందాగా, ఇంకో ఐదేళ్ళు తగ్గినట్లుండేవాడు. పావని తనకొచ్చే జీతంలో ఆయన ఫీజు మినహా ఇంచుకోమన్నా, వద్దనే వాళ్ళు. తనకే మొహమాటంగా వుండేది. ఎవరి నుండి ఏదీ వుదారంగా తీసుకోవటం ఇష్టంలేని పావనికది జన్మతః అబ్బిన సంస్కారమూ, ఆత్మాభిమానం.

★ ★ ★

మంజుల అందంగా, ఆరోగ్యంగా వుంటుంది. ఐనా పెరటి మొక్క వైద్యానికి పనికిరాదన్నట్లు శివకుమార్‌కి మంజులపట్ల కన్నా పరాయి స్త్రీలపట్లే అనురక్తి ఎక్కువ. అతడికున్న బయటి స్త్రీలతో సంబంధాలు మంజులకీ తెల్సు. కానీ పిల్లల భవిష్యత్తు, పరువు మర్యాదల కోసం మౌనం వహిస్తుండేది. కానీ అప్పుడప్పుడా ఘనీభవించిన మౌనం అగ్ని పర్వతంలా బద్దలై, లావాలా ప్రవహించి ఇంట్లో అశాంతి జ్వాలల్ని రేపుతుండేది. అలాంటి సందర్భాల్లో పిల్లల్ని తీస్కుని, అన్నయ్య శంకర్ ఇంటికి వెళ్ళి, ఓ రోజుండి ఆ అలజడి తగ్గాక వస్తుండేది. ఇక అప్పుడు శివకుమార్ లిక్కర్‌ని ఆశ్రయిస్తాడు. ఆరోజు వుదయం వారిద్దరి మధ్యా మళ్ళీ రేగిన తుపాన్ ఆ యింట్లో నిశ్శబ్దాన్ని మిగల్చగా అతడిలో రేగిన అశాంతి అతడిని లిమిట్స్ దాటి, తాగేలా చేసింది. అతడు తిరగేస్తున్న పోర్నో మేగజైన్ శరీరాన్ని వేడెక్కించింది.

దురదృష్ట వశాత్తూ అదే సమయంలో ఆ యింటిలోకి ఎంటరైనా పావని అక్కడ నెలకొన్న నిశ్శబ్దానికి కొంత ఆశ్చర్యపడింది.

కాలింగ్ బెల్ శబ్దానికి తలుపు తీసిన శివకుమార్‌ని అడిగింది. ''ఆంటీ పిల్లలు లేరా సర్?''.

అతడున్న స్థితిలో పావని అతడికి పేదవాడికి దొరికిన పెన్నిధిలా అనుకోకుండా తగిలిన జాక్‌పాట్‌లా తోచింది.

''లోపలున్నారు'' అంటూ తిరిగి తలుపు బోల్టు వేసేసి, ఆమె వెనుకే బెడ్‌రూమ్‌లోకెళ్ళి అమాంతం భల్లూకంలా చుట్టేశాడు. అన్ ఎక్స్‌పెక్టెడ్‌గా తనపై జరిగిన ఆ దాడి ఆమెను పెద్దషాక్‌కి గురిచేస్తే ఆమెని అచేతనురాలిని చేసిన ఆ క్షణమే తనకి చాలన్నట్లు నాజూగ్గా జాజి మొగ్గలా వున్న ఆమెని పూల చెండుని విసిరినట్లు బెడ్‌పై విసిరి, ఆమె లేచేలోగానే పులిలా మీదకి లంఘించి, కర్కశంగా ఆక్రమించుకున్నాడు. విశాలమైన ఆ ఇండిపెండెంట్ ఇంట్లో ఒంటరిగా అతడికి దొరికిన పావని వేడుకోలు, వేదనలు అరణ్య రోదనలే అయినాయి. కరడుగట్టిన కాముకత్వం, గాఢమైన కోరిక అతడిని విచక్షణా రహితుడ్ని చేశాయి. జీవితంలో ఆ క్షణమే తనకి శాశ్వతమన్నట్లు బలవంతంగా పావనితో అనుభవాన్ని పండించుకున్నాడు శివకుమార్.

అరగంట క్రితం అరవిరిసిన మందారంలా ఆ యింట్లో అడుగు పెట్టిన పావని ఇప్పుడు తుపాన్ తాకిడితో చెల్లా చెదురైన పూలతోటలా వుంది. అత్యాచారానికి గురైన తనవులాగే, మనసూ మండిపోతోంది భగ్గున. పూలపాన్పు మీద పురుష్‌కి పువ్వుల్లో పెట్టి సమర్పించాలని కలలుగన్న పరువం శివకుమార్ చేతిలో కర్కశంగా నలిగిపోయింది. కళ్ళలోకి నీళ్ళు కూడా రాని వేదనా భరితమైన అచేతనావస్థలో శూన్యంలోకి చూస్తూండిపోయింది. పురుష్‌తో పెళ్ళి ద్వారా తన జీవితంలోకి రాబోతున్న అదృష్టాన్ని ఈ నికృష్టుడు కాలరాశాడు. ఆమె ఆలోచనలను చెదరగొడుతూ అతడన్నాడు విలాసంగా సిగరెట్ పొగ వదులుతూ, ''చూడు పావనీ నా వృత్తి, ప్రవృత్తుల రీత్యా నాకు శీలం, గీలం లాంటి పదాల మీదాట్టే నమ్మకం లేదు. అవన్నీ మన సుఖాల కడ్డుపడే శృంఖలాలు. ఈరోజు ఎంతో ఫ్రస్ట్రేషన్‌లో వున్న నాకు బలవంతంగానే అయినా నీ వల్ల ఒక మంచి అనుభవం దక్కింది. ఒకసారి అనుభవించిన ఏ స్త్రీని మళ్ళీ జీవితంలో తిరిగి చూడకపోవటం నా పాలసీ. ఫ్యూచర్‌లో నా నుండి ఇక నీకే ప్రాబ్లం రాదు. అన్నట్లు, నీ పెళ్ళి కుదిరిందిట కదా! ఈ డబ్బు తీసుకుని, నీక్కావాల్సినవి కొనుక్కో. పెళ్ళికి ముందు నువ్వు నాతో రేప్ చెయ్యబడ్డావని నేను ఎవరికీ చెప్పను. అదే నీ పెళ్ళికి నేనిచ్చే గొప్ప కానుక. ఎందుకంటే ఆడపిల్ల చెడిపోవటం కంటే ఆ విషయం పదిమందికీ తెలియటంలోనే ఎక్కువ మనస్తాపం చెందుతుంది మన సమాజంలో'' కిటికీలోంచి బయట లముకుంటున్న చీకట్లని చూస్తూ, మంద్రంగా అతడు చెప్పిన మాటలన్నప్పటిదాకా ఆలకించిన పావని, అతడు విసిరిన డబ్బుని చీడపురుగులా చూసి ప్రాణం లేని మరబొమ్మలా లేచి తనువులో లేని శక్తిని కూడగట్టుకుని, ఆ ఇల్లు విడిచి, రోడ్డెక్కింది. ఆటోలో కూలబడి ఎలా చేరిందో తెలియని అయోమయావస్థలో ఇల్లు చేరి, నులక మంచంలో కూలబడి, మూడంకె వేసి, ముడుచుకు పడుకుంది పావని. ఆ షాక్ నుండి తేరుకున్నాక తన యిల్లూ, తమ పరిసరాలు, అక్కడ తాండవ మాడుతున్న బీదరికం, నెలరోజుల్లో జగరబోయే తన పెళ్ళి, అది వెంట బెట్టుకొచ్చే, అదృష్టం, అన్నీ గుర్తొచ్చి అప్పుడు తన్నుకొచ్చింది దుఃఖం, ఆ కుక్కి మంచంలో, ఓదార్చే తోడు కూడా లేని వంటరితనంలో వెక్కి వెక్కి ఏడ్చింది పావని.

శాంతమ్మగారింట్లో భోజనాలు కూడా వడ్డించి, వంటిల్లు సర్దుకుని, మిగిలిన కూరలు తీసుకుని రాత్రి తొమ్మిదిన్నరకిల్లు చేరిన పార్వతమ్మ, ఎంతకీ పావని తలుపు తీయకపోవటంతో కంగారుపడింది. చిన్న హుక్కులాంటి ఇనప గొళ్ళెం వూడేలా నెట్టి, మంచంలో నలిగిపోయిన మల్లె చెండులా వడిలిపోయి వున్న పావనిని చూసి, ఒక్కక్షణం గాభరా పడింది. అంతలోనే తెరుకుని, వళ్ళెరక్కుండా పడి వున్న కూతురు

## అదృష్టం పండింది

అనుకోని అదృష్టం ఇలియానాని నిలువనీయకుండా చేస్తోంది. దేవదాసు, పోకిరీ చిత్రాలతో మంచి నటిగా గుర్తింపు పొందిన ఈ భామ తన అందంతో కుర్రకారుని వెర్రెక్కిస్తోంది. ఇప్పుడీ భామ చేతిలో పలు తెలుగు చిత్రాలున్నాయి. రణం ఫేం అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో రవితేజ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం ఈనెలలోనే షూటింగ్ ప్రారంభించుకోనుంది. ఈ చిత్రంలో ఇలియానా నటిస్తోంది. బి.వి.వి.ప్రసాద్ ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవితేజ నటించిన విక్రముడు ఈ నెల 15న విడుదలకానుంది. మొత్తానికి ఇలియానా అదృష్టం పండినట్టుంది.



నుదిటి మీద చెయ్యేసి చూసి 'అమ్మో! జ్వరం, వళ్ళు కాలిపోతోంది. సాయంత్రం బాగానే వున్న పిల్లకి ఇలా ఆకస్మికంగా, ఈ జ్వరమేమిటో?' అనుకుంది. శాంతమ్మగారింట్లోంచి టాబ్లెట్ తెచ్చి, బలవంతంగా మింగించింది. తెల్లారు ఝాముకి కాస్త జ్వరం తగ్గి, తన మంచం పక్కన చెక్క స్టూలుపై కూర్చుని తన ముఖంలోకే ఆతృతగా చూస్తున్న తల్లిని చూసింది.

అంతే! ఒక్కసారిగా దుఃఖం మళ్ళీ కట్టలు తెంచుకుంది వెక్కి వెక్కి ఏడ్చింది జరిగిన అఘాయిత్యాన్ని తల్చుకుని. చివాల్న లేచి పక్క గదిలో, పావని రాత్రి విడిచిన బట్టలు చేతిలోకి తీసుకుంది పార్వతమ్మ. తెల్లని పెట్టీకోట్ మీద కాలనాగులా, శివకుమార్ ఆమెని కాటేసిన దానికి సాక్ష్యాల్లా ఎర్రని మరకలు, పావని అదృష్టాన్నీ, పవిత్రతనీ దహించి వేసిన అగ్నికీలల్లా..పార్వతమ్మ హృదయం ఆవేశంతో అవమానంతో రగిలిపోయింది. ఈ అకృత్యాన్నేమని ఎదిరించగలదు? బీదరికం, అసహాయత అనే ఛేదించలేని శృంఖలాలు వారిని నిర్వీర్యుల్ని చేశాయి. ఆమె అక్కడే కుప్పకూలిపోయింది.

ధనుర్మాసం తెల్లవారు ఝాము నాలుగ్గంటలైంది. నగర సంకీర్తనలతో కొందరు భక్తులు ఆ వీధిలోని విష్ణ్వాలయానికి వెళ్తున్నారు. ప్రక్క గదిలో అయిన అలికిడికి పార్వతమ్మ ఆలోచనల నుండి తేరుకుని, చివాలున పావని దగ్గర కొచ్చి, ఆమె చేతిలోకి తీసుకున్న కిరసనాయిల్ డబ్బాని చూసి ఉలిక్కిపడింది. ఆగ్రహంతో ఆమె కళ్ళు ఎరుపెక్కి, విశాలమయ్యాయి. విసురుగా పావని చేతిలో నుండి డబ్బా లాక్కుని, రాత్రి ఆమె విడిచిన బట్టల మీద కుమ్మరించి, అగ్గిపుల్ల గీసి పడేసింది. పావని అవాక్కై చూస్తుండిపోయింది. పార్వతమ్మ కళ్ళు చింత నిప్పుల్లా వున్నాయి. తల్లి మొహంలో తనకు ఊహ తెలిశాక ఎప్పుడూ అంతటి రౌద్రం, ఆవేశం చూడని పావని విస్మయంగా చూసింది తల్లిని.

ఛివాలున పావని జబ్బ పట్టుకుని, ''అగ్నికి ఆహుతి కావల్సింది నువ్వు కాదు ఆ భ్రాష్టుడు. వాడి అఘాయిత్యపు చిహ్నాలు. ఇదిగో అవిప్పుడు తగలబడ్తున్నై చూడు పాపము, తప్పు వాడు చేస్తే, శిక్ష నీ జీవితానికా? అసలు నీ జీవితాన్నంతం చేసుకునే హక్కు నీకెక్కడిది? నీకు జన్మనిచ్చింది నేను. ఇపుడు నీకో మంచి జీవితాన్నందించాలని నేను పడే ఆ తాపత్రయాన్ని అగ్నికాహుతి చేస్తావా? అసలు నువ్వేం తప్పు చేశావని చావాలి? నీ భవిష్యత్తు కోసమే నా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాను. నాలా నా కడుపున పుట్టిన నువ్వు కష్టపడకూడదని, చదువు చెప్పించాను. యోగ్యుడికిచ్చి పెళ్ళి చేద్దామనుకుంటున్నాను. ఎన్ని అఘాయిత్యాలు, అత్యాచారాలు చేసినా, ఎన్ని అనుభవాలు మూటగట్టుకున్నా, తన మీద ఏ మచ్చా పడదన్న అహంకారంతో మగాడు అనాదిగా స్త్రీని తన సుఖానికి బలి పశువుని చేస్తూనే వున్నాడు'' పార్వతమ్మ చెప్పుకుపోతోంది ఆవేశంగా ఆవేదనగా లోగొంతుకతో. ఎందుకంటే జరిగిన అనర్థం ఆ నాలుగ్గోడలు దాటకూడదని. మధ్యలో అడ్డొచ్చింది పావని. ఆమె కళ్ళు నీరెండిపోయిన బావిలా ఉన్నాయి. కన్నీళ్ళల్లో కరిగిపోయిన ఆశల్లా నిస్తేజంగా వున్నాయి. ''కానీ! నా బాధ అది కాదమ్మా!'' అంది తలొంచుకుని.

''పావనీ! నీ వేదన, బాధ నాకు తెల్సు. పురుష్‌ని ఎలా మోసం చేయనూ? అంటావ్. దానికి నా సమాధానమొక్కటే. ఆ జాతి అహంకారానికి శిక్ష ఆ జాతి అనుభవించాల్సిందే. పురుష్ మంచివాడవ్వచ్చు. నిన్ను అన్యాయంగా మలినం చేసిందీ మరో దౌర్భాగ్య పురుషుడే అన్నది గుర్తుపెట్టుకో'' తల్లి మాటలు పావనిని ఆలోచింప చేస్తున్నాయి.

చీకట్లు పల్చబడుతున్నాయి. పార్వతమ్మ పావని రెక్కబట్టుకుని బయటికి నడిపించింది. మంత్రముగ్ధురాల్లా పావని తల్లిననుసరించింది. వారి అడుగులు శివాలయాన్నానుకునున్న కృష్ణానదివైపు సాగాయి. మూడుసార్లు ముంచి తేల్చింది పార్వతమ్మ పావనిని పవిత్ర కృష్ణా జల్లాల్లో.

''పావనీ! నీ మాలిన్యాన్ని ఈ కృష్ణవేణి కడిగేసింది. ఇక నీకే కళంకమూ లేదు. జరిగిందంతా మర్చిపో. ఇప్పుడు నువ్వు మునుపటి పావనివే. భగవంతుడు స్వయంగా దిగరాడు. శాంతమ్మగారి వంటి పుణ్యాత్ముల ద్వారా మనలాంటి ఆర్తులు, అభ్యాగతుల నాదరిస్తాడు. ఆవిడ హృదయంలోకి భగవంతుడు చొరబడి, నీకు ఈ సంబంధం కుదిర్చాడు. నెలరోజుల్లో పెళ్ళై, కొత్తజీవితం ఆరంభిస్తావు. ఇక నీకంతా సుఖమే. ఇన్నేళ్ళు నువ్వనుభవించిన దరిద్రం, న్యూనతా భావం, అన్నిట్నీ మించి నిన్నటి అఘాయిత్యం అన్నీ... ఈ నీటిలో కొట్టుకుపోయాయి. ఇన్నాళ్ళలకి నా కలలు సాకారం కాబోతున్నాయని ఆనందించాను. ఇంకెంత? పెళ్ళి ముహూర్తానికి సరిగ్గా నెలే గడువుంది'' కూతురి పెళ్ళి పందిరి, బాజాభజంత్రీలు కళ్ళలో కనబడ్తున్నాయి పార్వతమ్మకి.

మాటల్లోనే, ఇల్లు సమీపించారు. వెలుగు రేఖలు విచ్చుకుంటున్నాయి. ఇప్పటివరకూ అంతా చీకటే. తన జీవితానికనుకుంది పావని.

తల్లి హితబోధతో తనలో జ్ఞానోదయమయింది. తనకంటుకున్న మలినమంతా కృష్ణవేణిలో ప్రక్షాళనమయింది అనుకుంది. బాలభానుడి లే వెలుగు కిరణాలకు ప్రకృతికాంత చీకటి దుప్పటిని తొలగించుకుని బద్ధకంగా నిదుర లేచి, ఒళ్ళు విరుచుకుంది. ఈ వెలుగు నిన్నటికన్నా భిన్నంగా తేజో వంతంగా తోచింది పావనికి.

★

## చిలుకపలుకులు

అందాలభామ అయేషా టకియా ఇప్పుడు చిలుకపలుకులు వల్లిస్తోంది. షూటింగ్స్ లేని టైంలో హాయిగా కుటుంబసభ్యులతో రెస్టారెంట్స్‌కి వెళుతూ కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటోంది. 'అవును. నాకు షాపింగ్ కంటే ఇలా రెస్టారెంట్స్‌కి వెళ్లి కొత్త కొత్త రుచులు ట్రై చేయడం ఎంతో బావుంటుంది. అయితే నా బరువు విషయంలో కూడా జాగ్రత్తపడుతున్నాను. కానీ అప్పుడప్పుడు రాజీ పడడం కష్టమైపోతోంది' అంటోంది బొద్దుగా మారిపోయిన ఈ ముద్దుగుమ్మ.

